అభిప్రాయ వేదికగా బ్లాగ్ (Blog)లు

బ్లాగ్ (Blog) అనేది వెబ్ లాగ్ అన్న పదాన్ని చిన్నది చేయగా వచ్చిన పదం. బ్లాగ్ అందరి కోసం రాసే డైరీ వంటిది. బ్లాగ్‌లో ఒక వ్యాసాన్నో, ఈ రోజు జరిగిన సంఘటననో, మనకి తెలిసిన కొంత సమాచారాన్నో ఒక విషయంపై మన అభిప్రాయాన్నో, మనము అల్లిన కథనో సులువుగా వెబ్ మీద అందుబాటులో వుంచవచ్చు. ఈ బ్లాగ్ అందరూ చదవలగలరు. ఒక విధంగా చూస్తే బ్లాగ్‌లకు, మామూలు వెబ్‌సైట్‌లకు పెద్దగా భేదం లేదనే చెప్పాలి. కానీ బ్లాగ్‌లలో రోజువారీగా మార్పులు చేసేటట్లు, కొత్త సమాచారం చేర్చేటట్లు సులువుగా వుండేందుకు ముఖ్యమైన కొన్ని మార్పులుంటాయి. బ్లాగ్‌లను వ్యక్తులు, కంపెనీలు, రాజకీయ పార్టీలు, పత్రికల వారు వాడుతున్నారు.

బ్లాగ్‌లో ఇతరుల అభిప్రాయాలు

బ్లాగ్‌లలో సమాచారం ఒకే దిశగా ప్రయాణిస్తుందనుకోవటం పొరపాటు. చాలా బ్లాగ్‌లలో చదివేవారి అభిప్రాయాలు నమోదు చేయటానికి సౌకర్యం వుంటుంది. ఆ బ్లాగ్‌లోని వ్యాసం ఒక డిబేట్ అవుతుంది. మనం రాసిన అభిప్రాయాలను ఇతరులు సమర్థించటం కానీ తప్పు పట్టటడం కానీ జరుగుతుంది. మనం కూడా వాటికి సమాధానాలు ఆ అభిప్రాయాల క్రింద రాస్తాము. ఈ విధంగా సంభాషణ జరుగుతుంది. అప్పుడే ఒక స్థిరమైన ఫలితం దక్కుతుంది. ఇతరులు రాసిన అభిప్రాయాలు అందరూ చదువుతారు. ఒక విషయంపై మనం ఒకే దృష్టితో ఆలోచించి రాస్తే, ఇతరులు వారి వారి అభిప్రాయాల ద్వారా వ్యాసానికి సార్థకత చేకూరుస్తారు. అందుకే ఇతరులు అభిప్రాయాలు రాయగల బ్లాగ్‌లను మాత్రమే నిజమైన బ్లాగ్‌లుగా పరిగణిస్తారు.

బ్లాగ్‌లతో వస్తున్న సామాజిక మార్పులు

ఇరాక్‌లో యుద్ధం జరిగినప్పుడు అమెరికాలో పత్రికలు, టీవీ ఛానళ్ళు ఇరాక్‌కు విరుద్ధంగా మాత్రమే వార్తలను ప్రచురించాయని కొందరి అభిప్రాయం. ఇరాక్‌లో అమెరికా చేసిన అక్రమాల గురించి అమెరికా ప్రజలకు తెలియదంటారు.

చిప్స్

ఆ సమయంలో బాగ్దాద్ నగర వాసులు రాసిన బ్లాగ్‌లు చాలా మందిని ఆకట్టుకున్నాయి. యుద్ధాన్ని కళ్ళారా చూసినవారి వర్ణన పత్రికల్లో ప్రచురించిన సమాచారానికి భిన్నాభిప్రాయంగా నిలిచింది. పత్రికా విలేకరులు కూడా బ్లాగ్‌లు రాయటం మొదలు పెట్టారు. సమాజంలో మరుగుపరిచే, ప్రోత్సాహంలేని విషయాలపై అందరికీ సమాచారాన్ని అందజేయాలనుకునేవారికి బ్లాగ్‌లు గొప్ప సాధనం. ఈ మధ్యకాలంలో సెన్సేషనలిజం పేరుతో పనికిరాని వార్తలను మొదటి పేజీలో ప్రచురించి, ముఖ్యమైన వార్తలను ప్రచురించకపోవడం లేదా లోపలి పేజీల్లో ఎటువంటి ప్రాధాన్యత లేకుండా ప్రచురించడం చూస్తూనే వున్నాం. మీడియాకు వున్న శక్తిని కొంతమంది వద్దే కేంద్రీకృతం కాకుండా, ప్రతి ఒక్కరికీ పంచగలవు బ్లాగ్‌లు. మన అభిప్రాయాలను వ్యక్తం చేసే ప్రాథమిక హక్కును సద్వినియోగం చేసుకొనేందుకు ఈ బ్లాగ్‌లు ఒక సాధనంగా ఉపకరిస్తాయి. ఒక వినియోగదారుడు ఏదేని వస్తువు గురించి తన బ్లాగ్‌లో రాస్తే, ఆ బ్లాగ్‌ను చూసిన పలువురికి ఆ వస్తువు గురించి తెలుసుకొనేందుకు వీలుకలుగుతుంది. ప్రకటనల మాయాజాలంలో పడి ఏ వస్తువు మంచిదో ఏ వస్తువు చెడ్డదో తెలుసుకోలేక పోతున్న ఈ రోజుల్లో ఇటు వంటి అభిప్రాయ సేకరణ ఎంతైనా అవసరం. చాలా మంది రాజకీయ నాయకులు కూడా తమ ఎన్నికల ప్రచారానికి బ్లాగ్‌లను కూడా వాడుతున్నారు. అనేక విద్యాలయాలు బ్లాగ్‌ల ప్రక్రియపై పరిశోధన లు మొదలుపెట్టాయి. అనేక కంపెనీలు తమ సమాచారాన్ని, అభిప్రాయా లను వినియోగదారులకు చేరవేసే వేదికగా కూడా వీటి ని ఉపయోగిస్తున్నాయి.

బ్లాగ్‌లను చదవడం ఎలా?

చదివే వారికి బ్లాగ్ అనేది సాధారణ వెబ్‌సైట్ లాంటిది మాత్రమే. వెబ్ బ్రౌజర్ వంటి సాఫ్ట్‌వేర్‌ను వాడి సులువుగా చదవవచ్చు. కానీ, బ్లాగ్‌లను కొందరు ప్రతి రోజూ మారుస్తుంటారు. మరి వారు ఒక కొత్త వ్యాసం రాసినప్పుడల్లా వారి వెబ్‌సైట్‌కి వెళ్ళాలని మనకి ఎలా తెలుస్తుంది? పోనీ రోజుకొకసారి మనకు ఉపయోగపడతాయనుకున్న బ్లాగ్‌లన్నీ చూడాలనుకున్నా, కొందరు తమ బ్లాగ్‌లను వారానికొకసారో నెలకొకసారో మార్చుతుంటారు. అలాంటప్పుడు సమయం చాలా వృధా అవుతుంది. ఎక్కువ బ్లాగ్‌లను చూడలేము. ఈ సమస్యకు పరిష్కారమే ఫీడ్ రీడర్. ఈ ఫీడ్‌ని ఒక సమాచార ధారగా అభివర్ణించవచ్చు. ఫీడ్ రీడర్ సాఫ్ట్‌వేర్‌ని కంప్యూటర్లో ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మనకి ఉపయోగపడతాయనుకున్న బ్లాగ్‌ల జాబితాను అందజేస్తాము. ఈ బ్లాగ్‌లలోకి చేరిన కొత్త వ్యాసాల గురించి, పాత వ్యాసాలలో జరిగిన మార్పుల గురించి, ఫీడ్ రీడర్ మనకి సమాచారం అందజేస్తుంది. రోజుకొకసారి అన్ని బ్లాగ్‌లను చదవాలనుకుంటే ఈ ఉపకరణం ఎంతో ఉపయోగపడుతుంది. అంతేకాదు, ఇరవై నాలుగు గంటలూ ఇంటర్నెట్ సౌకర్యం వున్నవారు ఫీడ్ రీడర్ని ఎప్పుడూ నడిపిస్తే, బ్లాగ్‌లలో మార్పులు జరగగానే ఇది ఆ సమాచారాన్ని మనకి అందజేస్తుంది.

బ్లాగ్‌లు రాయటం ఎలా?

బ్లాగ్ రాయాలంటే మీరు ఒక వెబ్‌సైట్ స్థాపించాలనుకుంటున్నారా? వెబ్‌సైట్లను తయారు చేయటానికి వాడే హెచ్.టి.ఎం.ఎల్. వంటి ప్రోగ్రామింగ్ భాషను నేర్చుకోవాలనుకుంటున్నారా? అవేమీ అవసరంలేదు. మీరు ఇ-మెయిల్ రాసినంత సులువుగా ఈ బ్లాగ్‌లను తయారు చేయవచ్చు. అన్నింటి కంటే సులువైన పద్ధతి బ్లాగర్ వంటి సైట్‌ను వాడటం. ఈ బ్లాగ్ సైట్లను వాడటం వలన మనం బ్లాగ్‌లు రాయటం ఎంతో సులువు అవుతుంది. మనకి ఒక అందమైన వెబ్‌సైట్ తయారుచేయటంతో మొదలుపెట్టి రోజూ సులువుగా బ్లాగ్‌లు రాయటం, ఇతరులు మనం రాసిన వ్యాసాలపై వ్యక్తం చేసే అభిప్రాయాలను, ఛాయా చిత్రాలను పొందుపరచటం వంటివి ఈ బ్లాగ్ సైట్‌లకు సాధారణ పనులు. రోజూ వ్యాసాలు రాయటానికి ఇ-మెయిల్‌ను ఏవిధంగా అయితే రాస్తామో అదేవిధమైన సదుపాయాన్ని ఈ సైట్లు మనకి కలిగిస్తాయి. దీనితో ఇ-మెయిల్ రాసినంత సులువుగా వెబ్‌సైట్లను రాయవచ్చు. ఇతరులు మన వ్యాసాలపై అభిప్రాయాలను రాయాలనుకుంటున్నప్పుడు అంతకంటే సులువుగా రాయగలరు. నిజానికి మన వ్యాసానికి ఎంతమంది అభిప్రాయాల్ని రాస్తారనేది ఎంత సులువుగా రాయగలమన్న దానిపైనే ఆధారపడి వుంటుంది. ఈ కనీస సౌకర్యాలతోపాటు, ఒక సంఘంలో వుండే వారందరూ కలిసి ఒకటే బ్లాగ్ వాడుకునేందుకు కూడా సదుపాయాలు ఈ బ్లాగ్ సైట్లలో కనిపిస్తాయి. ఫొటోలు లేని వెబ్‌సైట్‌లయినా, బ్లాగ్‌లయినా బోసిగా కనిపిస్తాయి. అందుకే ఈ సైట్లు ఫొటోలను బ్లాగ్ వ్యాసానికి మధ్యలో పెట్టుకొనే సౌకర్యాన్ని కల్పిస్తాయి. ఇక అందరూ బ్లాగ్‌ను సులువుగా చదవడానికిగానూ బ్లాగ్‌సైట్లు ఆర్.ఎస్.ఎస్. లేదా ఆటమ్‌ఫీడ్‌లను అందజేస్తాయి. ఈ ఫీడ్‌లను ఒక రీడర్ వాడి చదవవచ్చు. బ్లాగర్ (http://blogger.com) వంటి సైట్‌లో మీ బ్లాగ్‌లను తయారుచేసుకోవచ్చు. అదే విధంగా తెలుగులో కూడా బ్లాగ్‌లను రాయవచ్చు. వ్యాసాలను తెలుగులో చదువుకోవడానికి, రాయడానికిగాను ఒక సాఫ్ట్‌వేర్ అవసరమవుతుంది. ఈ సాఫ్ట్‌వేర్ ఏమిటి;? దీనిని ఎలా వాడాలి అనే వివరాలకు http://te.wikipedia.org సైట్‌ను చూడవచ్చు. ఇదీ కాకుంటే మరింత సులువుగా తెలుగు రాయడం, చదవడం చేయడానికి ఇటీవల విడుదలైన "స్వేచ్ఛ" తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్‌ను 'ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ (http://ap.gnu.org.in) వారి నుండి పొందవచ్చు. మరి ఆలస్యం ఎందుకు - మీ అభిప్రాయాలను, వ్యాసాలను పొందుపరిచేందుకు మీరూ ఒక కొత్త బ్లాగ్‌ను తయారుచేయండి.

- సునీల్ మోహన్

సందేహాలు - సమాధానాలు

నా కంప్యూటర్‌లో (windows98) విండోస్ 98 ఆపరేటింగ్ సిస్టమ్ లోడ్ చేసి ఉంది. కంప్యూటర్‌ను ఆన్‌చేసి ఆపరేటింగ్ సిస్టమ్ లోడ్ అయిన తరువాత ఏ అప్లికేషన్‌ను రన్ చేసినా నా హార్డ్ డిస్క్ శబ్దము చేస్తుంది. స్కాన్ డిస్క్‌ను, అలాగే డిఫ్రాగ్‌మెంటేషన్‌ను తరుచుగా చేస్తూనే ఉన్నాను.అ యినా ఈ సమస్య తీరటం లేదు. పరిష్కారం ఏమిటి?

- ఆర్.విజయలక్ష్మి, కర్నూలు.

ఏదైనా అప్లికేషన్ రన్ చేయాలి అంటే విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ స్వాప్ ఫైల్ ద్వారా హార్డ్‌డిస్క్‌ను సమాచారాన్ని పంపుతుంది. హార్డ్‌డిస్క్‌పై పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కూడా శబ్దము చేస్తుంది. కనుక ముందుగా పర్మనెంట్‌గా స్వాప్ ఫైల్ సైజును ఏర్పాటు చేసుకోవాలి. ఈ పని డిఫ్రాగ్‌మెంటేషన్ చేసిన తరువాత చేస్తే సరిపోతుంది. మరి ఎక్కువసార్లు డిఫ్రాగ్‌మెంటేషన్ చేయడం కూడా ప్రమాదకరము. మీరు విండోస్ 98ఎస్‌ఇ ఉపయోగిస్తున్నాను అంటున్నారు. కనుక క్రింది విధంగా ప్రయత్నించి చూడండి.

controlpanel> system> performances> virtual memory లో ప్రవేశించి అందులో వున్న **"Let me specify my own virtual memory"** అనే ఆప్షన్‌కి ఎనేబుల్ చేయండి. అందులో **Minimum value** అని **Maximum value** అని ఉన్న ప్రదేశాలలో మీకు కావాల్సిన విలువలను ఎంటర్ చేయండి. దీనిద్వారా మీరు పర్మనెంట్ స్వాప్ విలువలను కంప్యూటర్‌కు యిచ్చినట్లవుతుంది. సామాన్యంగా ఈ విలువలు మీరు ఉపయోగిస్తున్న రామ్ **(RAM)** విలువకన్నా రెండున్నర రెట్లు ఎక్కువగా యివ్వవచ్చు. **ఉదా : RAM 128MB అయితే** స్వాప్ యొక్క **Maximum valueని 128+128+64=320 గా** యివ్వవచ్చు.

ఆహ్వానం

హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్, ఐటీకి సంబంధించి మీకు ఎదురయ్యే సమస్యలను ఉత్తరం ద్వారాగానీ, ఇ-మెయిల్ ద్వారాగానీ మాకు పంపండి. మీ సమస్యకు పరిష్కారాన్ని ఇదే పేజీలో ప్రచురిస్తాము. అంతేకాకుండా 'చిప్స్' పేజికి కంప్యూటర్, ఐటీ, సైన్స్ రంగాలకు సంబంధించిన ఆర్టికల్స్, జోక్స్‌ను ఆహ్వానిస్తున్నాము.

మా చిరునామా: ప్రజాశక్తి, చిప్స్ డెస్క్, డోర్ నెం.1-1-298/4, స్ట్రీట్ నెం:1, అశోక్ నగర్, హైదరాబాద్- 20, ఫోన్: 27665420
email: chips@prajasakti.com

సూపర్ కంప్యూటర్‌కై దేశాల మధ్య పోటీ

తదుపరి సూపర్ కంప్యూటర్ పని విధానం యొక్క విశిష్టతకై చైనా, జపాన్, అమెరికాలు పోటీ పడుతున్నాయి. కొత్త సూపర్ కంప్యూటర్లు ఈ దశాబ్దపు చివరివరకూ వాడుకలోకి రానప్పటికీ సైన్స్ ప్రగతి, ఆధునిక టెక్నాలజీ, దేశభద్రతకి కీలక పెట్టుబడులుగా చూస్తున్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా పనిచేసే 500 సూపర్ కంప్యూటర్ల జాబితాలో చైనా 19వ స్థానం సంపాదించింది. "ఇది ఇప్పుడు దేశ ప్రతిష్టకు సంబంధించిన విషయంగా మారింద"ని అతిశక్తివంతమైన సూపర్‌కంప్యూటర్ల డిజైనర్, క్రైరోనెట్‌వర్క్ వైస్‌ప్రెసిడెంట్ స్టీవ్ వలాక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు ప్రపంచంలో అత్యంత వేగవంతమైన కంప్యూటర్ లారెన్స్ లైవ్‌మోర్ నేషనల్ ల్యాబొరేటరీలో వుంది. ఇది ఒక సెకండ్‌లో 136 ట్రిలియన్ లక్షల పనులను నిర్వహించే స్థాయికి చేరింది. ఇప్పుడున్న వేగవంతమైన కంప్యూటర్‌కి 8 రెట్లు అంటే ఒక సెకండుకు 1 క్వాడ్‌రిలీయన్ గణాంకాలు చేసే పెటా ఫ్లాప్ తయారీలో వుంది. ఒక పెటాఫ్లాప్ సూపర్ కంప్యూటర్ దాదాపు 1 బిలియన్ డాలర్ల ఖరీదు చేస్తుందని జపాన్ మరియు అమెరికాకు చెందిన నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

కూల్‌డ్రింక్ కొంప ముంచింది

రెండు దినాలసంది ఇల్లంతా కంపుగొడ్తుతున్నది. గున్నారావు శానా గుర్రయితాండు. ఆని కొడుకు అన్నారావును అడిగితే ఏం లేదని అంటుండు. అన్నారావును అన్నమయ్య తీర్న తయారు జేయాలని ఆల్లయ్యకుంది. గాని ఆడు మాత్రం దినాం కంప్యూటర్ ముందలకెల్లి లెవ్వడు. అన్నారావుకు రఘువంశం, కుమార సంభవం, వెంకటేశ్వరకళ్యాణం, అన్నమయ్య చరిత్ర, కబీరు చరిత్ర లాంటి సైన్మాలు జూపిచ్చిండు, పుస్తకాలు సదివిచ్చిండు గున్నారావు. వాటిల్ల అన్నారావుకు అపరకుభేరిని పాత్ర బాగా నచ్చింది. ఎట్లన్నజేసి ఎదో ఒకటి బాగ్గ సంపాయించాలనుకుండు. గట్ల అనుకుని ఓ కొత్త ప్రోగ్రాంను కనిపెట్టేందుకు కంప్యూటర్ ముందుకెల్లి లేవకుండా పనిజేసుడు మొదలు పెట్టిండు. గట్ల పనిజేస్కుంట పక్కనున్న బేకరినుండి బిస్కిట్లు, బ్రెడ్లు, పిజ్జాలు, కూల్‌డ్రింక్‌లు అప్పుతెచ్చుకుని తాగుతూ మొదలు బెట్టిండు. గుట్టలు గుట్టలు ఖాళీ డబ్బాలు, కవర్లతో రూంల కంపు పెరిగిపోయింది. గట్లనే ఫాస్టుఫుడ్ సెంటర్‌లో వాని అప్పుగీన పెరిగింది. బేకరోడు అచ్చి అప్పుగట్టమని లొల్లిచేయబట్టిండు. విషయం తెలుసుకుని పోరగాని రూంలకు బోయిండు గున్నారావు. పోరడు కిందపడి ఉన్నడు. ఆడ్ని ఆటోల ఏస్కోని దవఖానకు పోయిండు గున్నారావు. పోరడు దినాం కూల్‌డ్రింకులు తాగి బీమారి బారిన పడిండు అని డాక్టర్ చెప్పిండు. సంపాయించిన డబ్బులన్నీ దవఖానలనే ఖర్చుయిపొయినయ్. బేకరోడు మాత్రం ఆని అప్పుకింద కంప్యూటర్‌ను ఎత్తకపోయిండు. కూల్‌డ్రింక్ కోలుకోని దెబ్బేసిందని గున్నారావు నెత్తిన గుద్దెసుకుని ఇంటి ముంగల గూకున్నడు.

- గోర్ల

సైబర్ సయ్యాట

2020 నాటికి 3డి టీవీ

మనం ఇప్పటి వరకు 3డి సినిమాలనే చూశాము. భవిష్యత్‌లో 3డి టీవీలను కూడా చూడబోతున్నాము. స్టేడియంకు వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్షంగా చూస్తున్నప్పటికీ స్టేడియంలో వున్నవారిలా దాన్ని ఆస్వాదించలేకపోతున్నాము కదూ! 'చోటా చేతన్' లాంటి 3డి సినిమా చూసినప్పుడు నీళ్ళు తెరపై నుంచి మన ముఖంపై పడినట్లుగానో, ఒక ఆటగాడు సిక్సర్ కొట్టినప్పుడు బంతి స్టేడియంలో కూర్చున్న మన పక్కనే వచ్చిపడితే? అంతే కాదు మనం అభిమానించే ఆటగాడు సెంచరీ కొట్టగానే స్టేడియంలోకి వెళ్ళి భుజంతట్టి ప్రోత్సహించగలిగితే? దీనికితోడు స్టేడియంలోవున్న రద్దీ, మనచుట్టూ కూర్చున్నవారి వాసనలు, స్పర్శ- టీవీ చూస్తున్న మనకు ఈ అనుభూతి కలిగితే ....

2020 నాటికి ఇలాంటి 3డి టీవీని తయారుచేయడానికి జపాన్‌లో ఒక జాతీయస్థాయి ప్రాజెక్టు ప్రారంభం అయ్యింది. ఈ ప్రాజెక్టులో అటు ప్రభుత్వ సంబంధిత పరిశోధకులతో పాటు టెక్నాలజీ కంపెనీలకు చెందినవారు, విద్యావేత్తలు పాలుపంచుకుంటున్నారు. ఈ "వర్చువల్ టీవీ"లో హైడెఫినేషన్ చిత్రాలను 3డిలో ఏ కోణంనుంచైనా చూడటంతో పాటు భూమికి సమాంతరంగా వున్న తెరపై కనపడుతున్న వస్తువులను ముట్టుకోవచ్చు. మరియు వాటి వాసన కూడా చూసే వీలు వినియోగదారులకు వుంటుంది.

"జపాన్, బ్రెజిల్ మధ్య జరుగుతున్న వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌ను స్టేడియంలోనే వుండి చూస్తున్నట్లుగా మీ ఇంట్లో వుండి, మీ టీవీలో చూడటాన్ని ఊహించుకోగలరా" అని జపాన్ కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖకు చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ యసుయాకీ తాకూచీ అన్నారు. 3డి చిత్రాలను టీవీపై వీక్షించేందుకు కావలసిన టెక్నాలజీపై ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక యూనివర్శిటీలు, కంపెనీలు, పరిశోధనా సంస్థలు పరిశోధనలు జరిపి కొంత ప్రగతి సాధించాయి. అయితే వస్తువులను స్పర్శించి వాటి వాసనకూడా గ్రహించేందుకు కావలసిన టెక్నాలజీని అభివృద్ధి చేయటం చాలా క్లిష్టమైన కార్యం అని తాకూచీ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు.

అల్ట్రా సౌండ్, ఎలక్ట్రిక్ సిమిలేషన్, విండ్ ప్రెజర్ల ద్వారా స్పర్శను గ్రహించుటకు అనువుగా వుండే టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు పరిశోధకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

టీవీల మూలంగా అనేక ఉపయోగాలు అందుబాటులోకి రాబోతున్నాయి. ఉదాహరణకు టీవీలో ప్రసారమయ్యే షాపింగ్ సంబంధిత ప్రోగ్రామ్‌లలో కొనదలుచుకున్న వస్తువులను కొనేముందే తాకిచూడవచ్చు. దీని ప్రయోజనాలు వైద్యరంగంలో చాలా ఉపయోగకరం. డాక్టర్లు 3డి చిత్రాల ఆధారంగా గుండెలాంటి కీలక అవయవాలకు సిమిలేటెడ్ సర్జరీలు సునాయాసంగా చేయవచ్చు. టివి "యూనివర్సల్ కమ్యూనికేషన్స్"పై గురిపెట్టిన జపాన్‌కు చెందిన పెద్ద జాతీయ ప్రాజెక్టులో భాగం. ఉదాహరణకు మనం జపాన్ వెళ్ళకుండా, అక్కడి భాష తెలియకపోయినా సమాచారం పంచుకోవడానికి ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ సంవత్సరం చివరికల్లా యూనివర్సల్ కమ్యూనికేషన్స్‌లో భాగమైన భాషల తర్జుమా, విస్తృత వెబ్ సెర్చింగ్ పద్ధతులకు సంబంధించిన టెక్నాలజీల అభివృద్ధికై ఒక ఓపెన్ ఫోరం ఏర్పడుతుందని తాకూచీ తెలిపారు. మ్యాట్సుసిట ఎలక్ట్రిక్ ఇండస్ట్రియల్ కంపెనీ లిమిటెడ్, సోనీ కార్పొరేషన్ వంటి సంస్థలకు చెందిన పరిశోధకులతో కూడిన కమిటీ ఈ ప్రాజెక్టుపై గత నెలలో ఒక రిపోర్టును ప్రచురించింది. వచ్చే సంవత్సరం ఈ ప్రాజెక్టుకు 9మిలియన్ డాలర్ల సహాయం అవసరమవుతుందని కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖ ప్రభుత్వాన్ని కోరనుంది.

- నవీన్